సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 11 । జూన్ । 2024



వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు కుటుంబసభ్యులతో కలిసి సోమవారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు.



రోడ్డు పనులు చేపట్టాలి

గోదావరిఖని: ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో రోడ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ అధికారులను సోమవారం కలిసి విన్నవించారు.

గరిష్టం/కనిష్టం
36.0/28.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం అధికంగా నమోదు అవుతుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇంజనీర్‌కు సన్మానం



జీఎంను సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని: ఆర్జీ–1ఏరియా ఇంజనీర్‌గా పనిచేస్తూ జీఎంగా పదోన్నతి పొంది కొత్తగూడెం బదిలీపై వెళ్తున్న ఎస్వీ రాంమూర్తిని సోమవారం ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాంమూర్తిని పలువురు ఇంజినీర్లు, అధికారులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం రాంమోహన్, ఏజీఎం లక్ష్మీనారాయణ, అధికారులు నాగేశ్వర్‌రావు, ఆంజనేయులు, నాగేశ్వర్‌రావు, చంద్రశేఖర్, చిలక శ్రీనివాస్, బైద్యా, శివనారాయణ, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

13 లోగా అభ్యంతరాల స్వీకరణకు అవకాశం

పెద్దపల్లిరూరల్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో 60 పోస్టుల భర్తీకి సంబంధించి జారీచేసిన ఉద్యోగాలకు మెరిట్ జాబితాను నోటీసు బోర్డు, జిల్లా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ సోమవారం తెలిపారు. మెరిట్ జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 13లోగా పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. తదుపరి జాబితాలో ఎలాంటి సవరణలు చేయబోమని ఆయన స్పష్టం చేశారు.

నిధులు విడుదల చేయాలి



వినతిపత్రం అందిస్తున్న రహీం

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్రభావిత, పునరావాస గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని డీసీసీ కార్యదర్శి ఎండీ రహీం కోరారు. జిల్లా కేంద్రంలో సోమవారం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీని కలిసి ఒక వినతిపత్రం అందించారు. ప్రాజెక్టుల నిర్మాణం కోసం రైతులు విలువైన భూములను త్యాగం చేశారని, ప్రస్తుతం వారి పిల్లలకు ఉపాధి లేక రోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు. అదేవిధంగా ఎన్టీపీసీ నుంచి విడుదలయ్యే మురుగునీటితో సమీప ప్రాంతాల ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇరుకైన మల్కాపూర్ రోడ్డుపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు.

మైనింగ్ అధికారులకు కేటాయించాలి



వినతిపత్రం అందిస్తున్న అధికారులు

గోదావరిఖని: ఎడ్యుకేషన్ జీఎం పోస్టును మైనింగ్ అధికారులకే కేటాయించాలని అధికారులు కోరారు. ఈమేరకు సోమవారం ఆర్జీ–1 సీఎంవోఏఐ అధ్యక్షుడు పొనగోటి శ్రీనివాస్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న విధంగా మైనింగ్ అధికారులకు ఎడ్యుకేషన్ జీఎం పదవి ఇవ్వాలని సీఅండ్ఎండీని వారు కోరారు. ఈవిషయంలో అధికారుల సంఘం అధ్యక్షుడు ప్రత్యేక చొరవ తీసుకోవాలని అధికారులు విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో అధికారులు కె.చంద్రశేఖర్, డి.రామస్వామి, జి.రాములు, పి.శ్రీనివాస్, సురేశ్ తదితరులు ఉన్నారు.

డిపెండెంట్ల గరిష్ట వయో పరిమితి పెంపు

గోదావరిఖని: సింగరేణి కార్మికుల పిల్లల(డిపెండెంట్ల) గరిష్ట వయసును 40 ఏళ్ల వరకు పెంచుతూ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. గతంలో గరిష్ట వయసు 35ఏళ్ల వరకే ఉండేది. ప్రస్తుతం మరో ఐదేళ్లు పెంచుతూ సీఆర్‌పీ/పీఈఆర్/ఐఆర్/సీ/081/904 పేరిట సోమవారం సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు వెలువరించింది. సంస్థలో పనిచేసి మెడికల్ ఇన్వాలిడేషన్, అకాల మరణం పొందిన కార్మికుల పిల్లలకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఇది వర్తించేలా ఆదేశాలు జారీఅయ్యాయి. కాగా, కోవిడ్‌తో మెడికల్ ఇన్‌వాలిడేషన్‌లో వయసు మీరిన దృష్ట్యా ఉద్యోగావకాశాలు లభించని వారికి కూడా మినహాయింపు ఇస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. 09–03–2018 నుంచి ఉత్తర్వులు అమలులో ఉంటాయని అందులో పేర్కొన్నారు.

బండికి హోంశాఖ

- సహాయ మంత్రిగా ఎంపీ సంజయ్‌కుమార్‌కు అవకాశం
- 24 ఏళ్ల తర్వాత కరీంనగర్‌కు దక్కిన అవకాశం
- గతంలో చెన్నమనేని విద్యాసాగర్ రావుకు ఇదే శాఖ కేటాయింపు
- సంబరాల్లో మునిగితేలిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:



కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ సోమవారం సాయంత్రం విడుదల చేసిన కేంద్ర మంత్రుల జాబితాలో ఆయనకు పదవి ఖరారైంది. ఆదివారం సహాయమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఆయనకు ఈ శాఖను కేటాయించడంతో 24 ఏళ్ల తర్వాత కరీంనగర్‌కు మళ్లీ అదే శాఖ దక్కినట్లయింది. 1999లో కరీంనగర్ ఎంపీగా గెలిచిన చెన్నమనేని విద్యాసాగర్‌రావు అప్పటి ప్రధాని వాజ్‌పేయి కేబినేట్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పని చేశారు. తర్వాత 2019లో కిషన్‌రెడ్డికి సైతం ఇదే పదవి వచ్చింది. ఇప్పుడు సంజయ్‌కి హోంశాఖ సహాయమంత్రి ఇవ్వడంతో బీజేపీ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

ఇకపై పటిష్ట భద్రత

ఇప్పటివరకు ఎంపీ సంజయ్‌కుమార్‌ని ఎప్పుడు కావాలంటే అప్పుడు కలిసే వీలుండేది. ఆయన కేంద్ర సహాయ మంత్రి అయినప్పటికీ.. నేరుగా కలిసే వీలుంటుందని అంతా అనుకున్నారు. కానీ, అనూహ్యంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిత్వ శాఖను కేటాయించడంతో సహచరులు, అభిమానులు కాస్త డీలా పడ్డారు. ఈ శాఖ వల్ల ముందస్తు అపాయింట్‌మెంట్, తనిఖీలు లేకుండా ఎంపీ సంజయ్‌ని కలువడం సాధ్యం కాదు. ఇకపై ఆయన పటిష్ట భద్రత, నిఘా మధ్యనే తన పనులు చేసుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది.

ఎంపీగా పోలీసులతో తలపడ్డారు..

2019లో సంజయ్‌కుమార్ తొలిసారి ఎంపీగా గెలిచారు. అప్పటి నుంచి బీఆర్‌ఎస్‌పై పోరులో భాగంగా ఆయన ఎక్కువసార్లు పోలీసులతోనే తలపడాల్సి వచ్చింది. దుబ్బాక ఎన్నిక సమయంలో సిద్దిపేట సీపీ జోయల్ డేవిస్, జీహెచ్‌ఎంసీ ఎన్నికల సమయంలో అప్పటి సీపీ అంజనీ కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, హుజూరాబాద్ ఉప ఎన్నిక సమయంలో అప్పటి సీపీ సత్యనారాయణ, పదోతరగతి ప్రశ్నపత్రం లీకేజీ సమయంలో అప్పటి వరంగల్ సీపీ రంగనాథ్, కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడితో మాటల యుద్ధం కొనసాగించారు. సీపీ సత్యనారాయణతోపాటు పలువురు ఏసీపీలు, సీఐలు, ఎస్సైలపై పార్లమెంటు ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు కూడా చేశారు. అలాంటిది ఇప్పుడు వారి శాఖకే కేంద్ర సహాయ మంత్రిగా రావడం చర్చనీయాంశంగా మారింది.

ఫోన్ ట్యాపింగ్ విషయంలో సీరియస్

ఇటీవల ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రిటైర్డ్ పోలీసు అధికారి ప్రభాకర్‌రావు పైనా సంచలన ఆరోపణలు చేశారు. ప్రస్తుతం సంజయ్‌కి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి రావడంతో గత ప్రభుత్వంలో ఆయనపై నిఘా ఉంచిన పోలీసు అధికారుల్లో అభద్రతాభావం నెలకొంది. తనతోపాటు కుటుంబసభ్యులు, సిబ్బందిపై అనధికారికంగా నిఘా ఉంచి, వ్యక్తిగత కాల్స్‌ను చాటుగా విన్న విషయంపై బండి ఇప్పటికీ గుర్రుగానే ఉన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తప్పకుండా ఆయన ప్రభుత్వాన్ని నివేదిక కోరే అవకాశం ఉందని అనుచరులు వ్యాఖ్యానించడం కరీంనగర్ పోలీసు వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

సైబర్ నేరాల కట్టడే లక్ష్యం

గోదావరిఖని: 'రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల కట్టడి లక్ష్యంగా సేవలు అందిస్తున్నాం. అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతికతతో కేసులు ఛేదిస్తున్నాం. ప్రధానంగా సైబర్ నేరాల నియంత్రణ, మహిళలపై నేరాల కట్టడికి ప్రత్యేకంగా ఠాణాలు ప్రారంభించాం. వీటితోపాటు ఒక ట్రాఫిక్, 44 లా అండ్ ఆర్డర్ ఠాణాలు ఉన్నాయి. నేరస్తుల నియంత్రణకు రౌడీషీట్ తెరుస్తున్నాం. ప్రస్తుతం టాస్క్‌ఫోర్స్ బృందాలు కూడా అందుబాటులోకి వచ్చాయి' అని పోలీసు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూ వివరాలు..



- రామగుండంలో సైబర్ క్రైం పోలీసుస్టేషన్
- నేరస్తులపై రౌడీషీట్ నమోదు
- మావోయిస్టుల నియంత్రణకు చర్యలు
- పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

నేరాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

- నేరాలు జరగకుండా చర్యలు చేపట్టాం. అయినా ఏదైనా నేరం జరిగిన వెంటనే నిందితులకు శిక్ష పడేలా సాక్ష్యాధారాలు పద్బందీగా సేకరిస్తున్నాం.

సైబర్ నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

- గోదావరిఖనిలో ఏసీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశాం. రూ.లక్షలోపు నేరం జరిగితే స్థానిక ఠాణా, అంతకు మించి బాధితులు మోసపోతే సైబర్‌క్రైం ఠాణాలో ఫిర్యాదులు స్వీకరిస్తున్నాం.

కమిషనరేట్ ఏర్పాటైన తర్వాత నేరాల సంఖ్య ఎలా ఉంది?

- 2016 అక్టోబర్ 11న మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలకు కలిపి రామగుండం కమిషనరేట్ ఏర్పాటైంది. గతేడాది కొత్త భవనం ప్రారంభించాం. ప్రస్తుతం నేరాలు చాలా వరకు తగ్గాయి. ఏడాదిలో సగటున 1,200 కేసులు నమోదవుతున్నాయి. మావోయిస్టులను కట్టడి చేస్తున్నాం.

ప్రజలకు పోలీస్‌శాఖ ఎలా చేరువైంది?

- ఫ్రెండ్లీ పోలీస్‌తో మా శాఖ ప్రజలకు చేరువైంది. బాధితులకు అండగా, నేరస్తులకు సింహ స్వప్నంగా ముందుకు సాగుతోంది. రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోకుంటే పీడీ యాక్ట్ నమోదు చేస్తున్నాం.

రోడ్డు ప్రమాదాలను ఎలా నియంత్రిస్తున్నారు?

- నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. స్పీడ్‌గన్‌ల ద్వారా రాజీవ్ రహదారిపై వాహనాల వేగం నియంత్రిస్తున్నాం.

గంజాయి కట్టడికి ఎలాంటి చర్యలు చేపట్టారు?

- రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గంజాయి కట్టడికి నిందితులపై ఉక్కుపాదం మోపుతున్నాం. ఇటీవల 21కేసులు నమోదు చేసి 53మందిని అరెస్ట్ చేశాం. వారినుంచి రూ.5.08లక్షల విలువైన 14.53కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నాం.

రామగుండం పోలీసు కమిషనరేట్ స్వరూపం ఇది..

- 2016 అక్టోబర్ 11న రామగుండం పోలీస్ కమిషనరేట్ గోదావరిఖనిలో ప్రారంభమైంది.
- తొలి పోలీసు కమిషనర్‌గా విక్రమ్‌జిత్ దుగ్గల్ బాధ్యతలు స్వీకరించారు. ఆతర్వాత వి.సత్యనారాయణ, చంద్రశేఖర్, రెమా రాజేశ్వరి వరుసగా సేవలు అందించారు. ప్రస్తుతం సీపీగా సీపీ శ్రీనివాస్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.
- కమిషనరేట్ పరిధిలో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలు ఉన్నాయి
- సీపీతోపాటు ఇద్దరు డీసీపీలు, పది మంది ఏసీపీలు, 2,300 మంది విధుల్లో ఉన్నారు.
- 42 లా అండ్ ఆర్డర్, మూడు ట్రాఫిక్, ఒక సైబర్ క్రైం, మరోటి మహిళా పోలీస్‌స్టేషన్ ఉన్నాయి

కార్మికుల వేతనాల్లో కోత తగదు

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్, కమిషనర్ శ్రీకాంత్‌కు వినతి

కోల్‌సిటీ(రామగుండం): రాష్ట్రంలో పురపాలక, నగరపాలక సంస్థల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాల్లో కోత విధించడానికి ఆర్థిక శాఖ నుంచి జారీచేసిన జీవో నంబరు 970ని వెంటనే నిలిపివేయాలని రామగుండం నగరపాలక సంస్థలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ సమస్యపై రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీకాంత్‌ను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలను సమర్పించారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, వైద్యం, చదువులు తదితర ఖర్చులను కార్మికులు భరించలేకపోతున్నారని అన్నారు. ఇలాంటి తరుణంలో వేతనాలు పెంచాల్సింది పోయి సగం వరకు కోత విధించాలని జీవో జారీచేయడం ఏమిటని ప్రశ్నించారు.



ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు విన్నవిస్తున్న ఉద్యోగులు

స్పందించిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్.. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డితో ఫోన్లో మాట్లాడారు. సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లారు. కార్పొరేటర్ మహంకాళి స్వామితోపాటు ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్ నాయకులు బండారి రవిగౌడ్, అశోక్, శశి, ఉదయ్, శీను, కాంపల్లి శంకర్, బిల్ కలెక్టర్లు సురేందర్, రవి, జేఏసీ నాయకులు వై.యాకయ్య, నడిపెల్లి మురళీధర్‌రావు, మంథని లింగయ్య, వెల్పుల రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రి పనులు ప్రారంభించండి

జ్యోతినగర్(రామగుండం): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో 100 పడకల సామర్థ్యంగల ఈఎస్ఐ ఆస్పత్రి పనులు వెంటనే ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ బాబా కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లోని కార్యాలయంలో ఈఎస్ఐ రీజినల్ డైరెక్టర్ గాగ్రేకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు వినతిపత్రం అందించామన్నారు. గత మార్చి 2024న టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని, పనులు వేగవంతం చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. కాగజ్‌నగర్‌లోని నిరుపయోగంగా ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రిని రామగుండం తరలించి 24గంటల పాటు కార్మికులకు వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారని అన్నారు.



వినతిపత్రం అందిస్తున్న అహ్మద్ బాబా

ఉత్తర్వులు సరే.. నిషేధం ఎక్కడ?

సుల్తానాబాద్‌రూరల్: పాన్‌మసాలా, గుట్కా, పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జిల్లావ్యాప్తంగా జోరుగా సాగుతున్నాయి. ప్రజారోగ్యం దృష్ట్యా వీటి తయారీ, విక్రయాలు, రవాణాను నిషేధిస్తూ ఫుడ్ సేఫ్టీ విభాగం కమిషనర్ మే 26న ఉత్తర్వులు జారీ శారు. ఏడాదిపాటు ఇవి అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. కానీ, జిల్లాలో ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. నిషేధాన్ని పక్కగా అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం.. నామమాత్రంగా తనిఖీలు చేస్తోందనే విమర్శలు ఎదుర్కొంటోంది. పాన్‌మసాలా, గుట్కా సాచెట్లు, పౌచ్‌లు, డబ్బాలు.. ఇలా ఏరకంగా ప్యాక్ చేసి విక్రయించినా నిషేధం వర్తిస్తుదని ప్రభుత్వం ప్రకటించినా.. ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. ధనార్జనే ధ్యేయంగా కొందరు గుట్కా వ్యాపారులు.. మండల స్థాయి మొదలుకొని జిల్లాస్థాయి వరకు సిండికేట్‌గా మారి విక్రయాల జోరుపెంచినట్లు తెలిసింది. అంతేకాదు.. అధికార యాంత్రంగాన్ని తమ గుప్పట్లో పెట్టుకునేందుకు ఎంతోకొంత ముట్టజెప్పాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. మరోవైపు.. అధికారులు చేస్తున్న దాడులు, తనిఖీల్లో చిరువ్యాపారులే పట్టుబడుతున్నారు.

దెబ్బతింటున్న ప్రజారోగ్యం

పాన్‌మసాలాలు, పొగాకు ఉత్పత్తులు ఎక్కడపడితే అక్కడ లభిస్తుండడంతో యువత వాటికి బానిసలవుతున్నారు. తమ ఆరోగ్యాలను పణంగా పెడుతున్నారు. గుట్కా, పాన్‌మసాలు, ఇతరత్రా పొగాకు ఉత్పత్తుల్లో అనారోగ్యం బారినపడుతున్నారని మరోవైపు వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు ఇప్పటికైనా స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

మోదీ ఫాసిస్ట్ పాలనకు ప్రజల అడ్డుకట్ట

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు జువ్వాడి చలపతిరావు

జ్యోతినగర్(రామగుండం): ప్రధాని మోదీ ఫాసిస్ట్ పాలనకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు జువ్వాడి చలపతిరావు విమర్శించారు. ఎన్టీపీసీ ఆటోనగర్ ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన మోదీ.. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించారని, అందుకే ఈసారి మెజార్టీ సీట్లు రాలేదన్నారు. అంతేకాదు.. హిందుత్వ ఎజెండాకు వ్యతిరేకంగా ఓటర్లు తీర్పు ఇచ్చారని అన్నారు. రైతు ఉద్యమం, అధిక ధరలు, మతత్వం లాంటి సున్నితమైన అంశాలు లేవనెత్తడం, రాజ్యాంగం మారుస్తామనడం, లేబర్ కోడ్‌లు కుదించడం వంటి విషయాలను ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం.. ఇప్పటికైనా కళ్లు తెరిచి స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని, రైతులకు మద్దతు ధర చెల్లించాలని, లేబర్ కోడ్‌లు ఎత్తివేసి పాత కార్మిక చట్టాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్య, వైద్య రంగాలకు బడ్జెట్‌లో పది శాతం కేటాయించాలని సూచించారు. కేసీఆర్ నిరంకుశ పాలనను ప్రజలు గద్దె దింపి కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారంటీలను వంద శాతం అమలు చేయాలని కోరారు. సమావేశంలో న్యూడెమోక్రసీ కార్యదర్శి కె.రాజన్న, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ, జిల్లా అధ్యక్షుడు నరేశ్, కాంట్రాక్టు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్, పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు కె.జ్యోతి, నాయకులు అశోక్, బుచ్చయ్య, రాయమలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చలపతిరావు

అవే సమస్యలు.. మళ్లీమళ్లీ

- ఏళ్లుగా కదలని ఫైళ్లు
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు



ఈమె పేరు ఆవుల లక్ష్మి. జూలపల్లి మండలం కాచాపూర్ స్వగ్రామం. తాత్కాలిక సదరం సర్టిఫికెట్ ఉంది. కొంతకాలంపాటు పింఛన్ తీసుకుంది. ఏడాదిక్రితం నిలిచిపోయింది. అధికారుల చుట్టూ తిరిగింది. చివరకు ప్రజావాణిలోనూ విన్నవించింది. ఏ ఆధారంలేని తనకు పింఛన్ ఇవ్వాలని వేడుకుంటోంది.



దివ్యాంగుడైన ఇతడి పేరు నాగరాజు. ఇల్లు లేదు. సొంత స్థలంలేదు. డబుల్‌బెడ్రూమ్ ఇంటికోసం మూడేళ్లక్రితం దరఖాస్తు చేశాడు. చిరునామా లభించలేదనే సాకుతో అధికారులు తిరస్కరించారు. అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదు. చేసేదిలేక ప్రజావాణిలోనూ పలుమార్లు విన్నవించాడు. సమస్య ఇంకా పరిష్కారం కాలేదంటున్నాడు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: తమ సమస్యలు తక్షణమే పరిష్కారమవుతాయనే గంపెడాశతో అనేకమంది అభాగ్యులు ప్రతీసోమవారం నిర్వహించే ప్రజావాణికి కదిలి వస్తున్నారు. ఇందుకోసం అనేక వ్యయప్రయాసలకు గురరవుతున్నారు. మారుమూల పల్లెల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చి అధికారులకు అర్జీల రూపంలో సమస్యలు విన్నవిస్తున్నారు. ఇందులో భూ, పింఛన్ తదితర అర్జీలు ఉంటున్నాయి. సంబంధిత శాఖల అధికారులు వాటికి పరిష్కార మార్గాలు చూపకపోవడంతో ప్రతీ ప్రజావాణికి ఈ ఫిర్యాదులే మళ్లీమళ్లీ వస్తున్నాయి.

కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినా..

ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యం ఇచ్చి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ జారీచేస్తున్న ఆదేశాలను అధికారులు, సిబ్బంది పెడచెవిన పెడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల కమాన్‌పూర్ మండలం కన్నాలకు చెందిన ఇస్లావత్ పున్నం చందు – లక్ష్మి దంపతులు తమకున్న రెండున్నర ఎకరాల్లో సాగు చేసుకుంటున్నామని, ఇదే సర్వే నంబరులోని భూమిని గతంలో అమ్ముకున్నోళ్లకే అధికారులు మళ్లీ పట్టా పాసుబుక్కు ఇచ్చారని కన్నీంటి పర్యంతమయ్యారు. అంతేకాదు.. ధరణి సహాయక కేంద్ర సిబ్బందిని ఈవిషయంపై అడిగితే సమాధానం ఇవ్వలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ సిబ్బంది వద్దకు స్వయంగా వెళ్లి వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళన, ఆవేదనతో వచ్చే వారికి తగిన సూచనలు ఇవ్వడంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు అనేకంగా ఉన్నాయి.

42 దరఖాస్తుల స్వీకరణ

పార్లమెంట్ ఎన్నికలు ముగిశాక చేపట్టిన తొలిసారి సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అభ్యాగ్యులు పెద్దఎత్తున తరలివచ్చారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ 42 దరఖాస్తులను స్వీకరించారు. అందులో 12 రెవెన్యూ, 30 ఇతర శాఖలకు చెందినవని అధికారులు తెల్పారు.

చెరువుమట్టి తరలిస్తున్నరు



మంథని మండలం బిట్టుపల్లి నుంచి చెరువు మట్టిని పెద్దపల్లి ప్రాంతంలోని ఇటుక బట్టీలకు అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో గండిపడుతోంది. అనుమతిలేకుండా మట్టి తరలిస్తున్న వారిపై చర్య తీసుకోవాలి. బాధ్యులైన ఇరిగేషన్ అధికారులను సస్పెండ్ చేయాలి.

– చింతలకుమార్, రంగాపూర్

ఇండ్లు ఇప్పించండి



నిరుపేద కుటుంబాలకు చెందిన మాకు నివాసం ఉండేందుకు ఇండ్లు లేవు. ఎక్కడో ఓచోట తల దాచుకుంటున్నం. చందపల్లిలో ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్రూమ్ ఇండ్లలో మాకు ఇండ్లు కేటాయించి ఆదుకోవాలె.

– ఉమాదేవి, లక్ష్మి, చందపల్లి

కేజీబీవీలో సీటు కావాలె



నిరుపేద దళిత కుటుంబానికి చెందిన మా కూతురు సింధుకు గర్రెపల్లిలోని కేజీబీవీలో సీటు ఇప్పించి ఆదుకోవాలి. కూలీనాలీ పనులు చేసుకుంటూ బతుకుతున్నం. సీటు ఇప్పించి మా బిడ్డకు మంచి భవిష్యత్ ఇప్పించాలె.

– మంథని ఝాన్సీ, గోదావరిఖని

పాసుబుక్కు లేదు



కమాన్‌పూర్ మండలం రాజాపూర్ శివారులోని అసైన్డ్ భూమిని నాకు కేటాయించారు. నువ్వు పంట పండించుకుంటున్న. ఈ భూమికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకం ఇప్పించి ఆదుకోవాలె.

– అంబీర్ కృష్ణ, కమాన్‌పూర్

క్లుప్తంగా

బావిలో పడి యువకుడి మృతి


ఆంజనేయులు (ఫైల్)

సైదాపూర్(హుస్నాబాద్): మండలంలోని రాయికల్ తండా పరిధి ఘనపూర్ తండాకు చెందిన బానోత్ ఆంజనేయులు(18) బావిలో పడి మృతిచెందినట్లు ఎస్సై ఆరోగ్యం తెలి పారు. ఆయన వివరాల ప్రకారం.. బానోత్ మోతీలాల్–మంగ దంపతులకు ఇద్దరు కూతు ళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కొడుకు ఆంజనేయులు డిగ్రీ ఫస్టియర్ చదివి, ఆపేశాడు. ఆదివారం రాత్రి 11 గంటలకు బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు రాత్రంతా వెతికినా ఆచూకీ తెలియలేదు. సోమవారం ఉదయం వ్యవసాయ బావుల వద్ద వెతకగా ఘనపూర్ తండా శివారులోని బావి వద్ద చెప్పులు, ఫోన్ కనిపించాయి. కరెంట్ మోటార్ ద్వారా బావి లో నీటిని తోడేయగా ఆంజనేయులు మృతదేహం కనిపించింది. బహిర్భూమికి వెళ్లి, ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందినట్లు మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎర్రకుంటలో పడి వ్యక్తి ..


లచ్చయ్య (ఫైల్)

ఎలిగేడు(పెద్దపల్లి): మండల కేంద్రానికి చెందిన కుదుదుల లచ్చయ్య (55) స్థానిక ఎర్రకుంటలో పడి మృతి చెందినట్లు జూలపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. లచ్చయ్య ప్రతీరోజు ఉదయం గేదెలను ఎర్రకుంట వద్ద వదిలిపెట్టి, సాయంత్రం ఇంటికి తోలుకువచ్చేవాడు. అతను నిత్యం మద్యం మత్తులోనే ఉంటాడు. ఆదివారం కూడా జీవాలను ఎర్రకుంట సమీపంలో వదిలిపెట్టి వచ్చి, సాయంత్రం తోలుకువచ్చేందుకు వెళ్లాడు. మద్యం మత్తులో కాలుజారి ఎర్రకుంటలో పడిపోయాడు. రాత్రయినా ఇంటికి రాలేదు. స్థానికులకు సోమవారం ఉదయం ఎర్రకుంటలో లచ్చయ్య మృతదేహం కనిపించింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

పెద్దపల్లిరూరల్: రాగినేడు గ్రామానికి చెందిన పడాల రజిత (38) కరీంనగర్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందిందని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. రజిత తన కుటుంబీకులతో కలిసి ఆదివారం ఆరు బయట నిద్రిస్తుండగా పాటుకాటు గురైంది. కుటుంబసభ్యులు వెంటనే పెద్దపల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. మృతురాలి భర్త వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

చెట్టును ఢీకొన్న బైక్

- యువకుడికి తీవ్ర గాయాలు

శంకరపట్నం(మానకొండూర్): చెట్టును బైక్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. శంకరపట్నం మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన దేవునూరి అనిల్ సోమవారం పని నిమిత్తం బైక్‌పై కేశవపట్నం వెళ్లాడు. తిరిగి గ్రామానికి వస్తుండగా రాజాపూర్ శివారులో వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. అనిల్‌కు తీవ్ర గాయాలవగా స్థానికులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి, అతన్ని హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి


మృతిచెందిన గేదె

కరీంనగర్‌రూరల్: మండలంలోని దుబ్బపల్లిలో రైతు మోతె శ్రీనివాస్‌రెడ్డికి చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో మృతిచెందింది. బాధితుడి కథనం ప్రకారం.. శ్రీనివాస్‌రెడ్డి సోమవారం గేదెలను మేపుతున్నాడు. ఓ గేదె సమీపంలోని 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ వైర్‌ను తాకడంతో విద్యుదాఘాతం సంభవించి, మృతిచెందింది. సమాచారం అందుకున్న విద్యుత్‌శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును బాధిత రైతును అడిగి తెలుసుకున్నారు. గేదె విలువ రూ.70 వేలు ఉంటుందని, విద్యుత్‌శాఖ పరిహారం అందించాలని శ్రీనివాస్‌రెడ్డి కోరాడు.

పులా.. అడవి పిల్లా?

- చొప్పదండి మార్కెట్ యార్డులో సంచారం
- సోషల్ మీడియాలో వైరల్

చొప్పదండి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం తెల్లవారుజామున పులి సంచరించిందని జోరుగా చర్చ జరిగింది. సంబంధిత వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. వీడియోలో ఉన్నది పులా.. అడవి పిల్లా అన్నది తెలియడం లేదని స్థానికులు తెలిపారు. దీంతో అధికారులు సీసీ పుటేజీలను పరిశీలించారు. అడవి పిల్లిలా చిన్నగా ఉండటంతో పులి పిల్లనా, పిల్లి లాంటి జంతువా అన్నది తేల్చలేదు. చొప్పదండిలో పులి సంచరిస్తుందన్న సమాచారం చుట్టుపక్కల గ్రామాలకూ చేరింది.

మత్తెక్కిస్తున్న బెల్ట్‌షాప్‌లు

- సూర్యోదయానికి ముందే అమ్మకాలు
- బహిరంగంగా మద్యం అక్రమ విక్రయాలు
- వైన్‌షాపులు తెరిచేలోపే రూ.20 వేల వరకు వ్యాపారం


బ్రిడ్జి రోడ్డులో ఉదయమే తెరిచిన బెల్ట్‌షాప్

మంథని: మార్కెట్‌లో రోజూలు ముందుగా తెరుచుకునేవి ఛాయ్ కొట్లు.. ఆ తర్వాత పాన్‌షాపులు..వాటితర్వాత టిఫిన్ సెంటర్లు.. కాసేపాగితే ఫుట్‌పాత్ వ్యాపారాలు.. చివరకు పెద్దదుకాణాలు ప్రారంభమవుతాయి. కానీ, కొద్దిరోజులుగా వీటన్నింటి కన్నా ముందే.. అంటే సూర్యోదయానికి ముందుగానే బెల్ట్‌షాప్‌లు తెరుచుకుంటున్నాయి. మద్యం ప్రియులు అప్పటికే వాటి ఎదుట నిరీక్షించి ఉంటున్నారు. ఎప్పుడు మద్యం దొరుకుతుందా? అని పడిగాపులు కాస్తున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఈ దృశ్యాలు ఆందోళన కలిగిస్తున్నా.. కట్టడి చేయాల్సిన ఎక్సైజ్ శాఖ మత్తువీడడం లేదు.

ఉదయం పదిలోపే రూ.20 వేల వ్యాపారం

- ప్రభుత్వం ద్వారా లైసెన్స్ పొందిన మద్యం దుకాణాలు ఉదయం పది గంటల తర్వాత తెరుచుకుంటాయి.
- కానీ, అక్రమంగా సిట్టింగ్‌లు పెట్టి మద్యం విక్రయించే బెల్ట్‌షాపులకు ఇలాంటి నిర్దేశిత సమయాలేమీలేవు.
- ఏటీఎంలో ఏనీటైం నగదు లభించని సందర్భాలు ఉన్నా.. కొన్ని బెల్ట్ షాపుల్లో 24గంటలపాటూ మద్యం అందుబాటులో ఉంటుందంటే అతిశయోక్తికాదు.
- ఇది ఎక్కడో మారుమూల గ్రామాల్లో కానేకాదు.. మంథని లాంటి పట్టణ ప్రాంతాల్లోనే నిత్యం సాగుతున్న తంతు..
- మంథనిలోని బ్రిడ్జి రోడ్డు మొదలు.. బస్సు డిపో వరకూ దారిపొడవునా ఎనీ టైం మందు యథేచ్ఛగా విక్రయిస్తున్నారు.
- మద్యం ప్రియులు దుకాణాలకు బహిరంగంగానే వచ్చి.. తమ పనికాన్చి వెళ్తున్నారు.
- మద్యం దుకాణాలు తెరువక ముందే రూ.10వేల నుంచి రూ.20వేల బెల్ట్‌షాపుల్లో వ్యాపారం సాగుతోందంటే పరిస్థితి ఎలా చేయి దిటిపోయిందో అర్థం చేసుకోవచ్చు.

ఎమ్మార్పీకి మించి ధరలు..

జిల్లాలోని ఆయా మండల కేంద్రాలు, గ్రామాలు, పట్టణాల్లో సుమారు 500కు పైగానే బెల్ట్‌షాప్‌లు ఉన్నట్లు అంచనా. ఒక్కో గ్రామంలో ఒకటి నుంచి ఐదు వరకు బెల్ట్‌షాపులు నడుస్తున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లో 20కిపైగానే నడుస్తున్నాయని అంటున్నారు. అయితే, మద్యం షాపులతో పోల్చితే ఇక్కడ ఎమ్మార్పీలకు మించి అధిక ధరలకు మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయని మద్యం ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కళ్లముందే దందా..

గ్రామాలు, పట్టణాలనే తేడా లేకుండా బెల్ట్‌షాపుల్లో పెద్దఎత్తున మద్యం విక్రయాలు కళ్ల ముందే జరుగుతున్నా, మద్యం ప్రియులు సిట్టింగ్ గదికి వచ్చి పోతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆదేశాల అమలు ఎక్కడ?

పార్లమెంట్ ఎన్నికల వేళ బెల్ట్‌షాపులు మూసివేయాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఒకట్రెండు సార్లు హడావుడి చేస్తున్న అధికారులు.. ఆ తర్వాత చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, తద్వారా బెల్ట్‌షాపులకు అడ్డూఅదుపూ లేకుండాపోతోందని విమర్శలు వస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం

మద్యం అక్రమ విక్రయాలపై చర్యలు తీసుకుంటాం. బెల్ట్‌షాపు నిర్వాహకులపై ఇప్పటికే కేసులు నమోదు చేశాం. మాకు తెలియకుండా ఇంకా ఎక్కడైనా అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– రాకేశ్, సీఐ, ఎక్సైజ్ శాఖ, మంథని

పదోన్నతుల్లో అన్యాయం


సైలో ఎక్కి నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ కార్మికులు


కార్మికులతో ఫోన్లో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు, కంపెనీ అధికారులు

- 'కేశోరాం' కాంట్రాక్ట్ కార్మికుల ఆరోపణ
- సైలో పైకి ఎక్కి నిరసన
- అధికారులు, నాయకుల హామీతో ఆందోళన విరమణ

పాలకుర్తి(రామగుండం): పదోన్నతులు కల్పించడంలో తమకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలోని కాంట్రాక్ట్ కార్మికులు సోమవారం 150 మీటర్ల ఎత్తులోని బెండింగ్ సైలో పైకి ఎక్కి నిరసన తెలిపారు. కంపెనీలోని 25మందికి కాంట్రాక్ట్ బేసిక్ కార్మికులుగా ఇటీవల పదోన్నతి కల్పించారు. సీనియర్లను కాదని జూనియర్లకు పదోన్నతి కల్పించారని దాదాపు 18మంది కార్మికులు కంపెనీ ఆవరణలోని 'సైలో' పైకి ఎక్కి ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని లేకుంటే ఆత్మహత్య చేసుకుంటామని భీష్మించుకుని కూర్చున్నారు. దాదాపు రెండుగంటల పాటు ఆందోళన చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. సమాచారం అందుకున్న ఎస్సై స్వామి పోలీసు సిబ్బంది, పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మిక సంఘాల అధ్యక్షులు బయ్యపు మనోహర్‌రెడ్డి, సూర సమ్మయ్య, బీఆర్ఎస్ నాయకుడు కౌశికహరి తమ అనుచరులతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాంట్రాక్ట్ బేసిక్ విషయంపై ప్లాంట్‌హెడ్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఆర్ మేనేజర్ పార్థసారథిలతో నాయకులు చర్చలు జరిపారు. అర్హులైన వారికి పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. జాబితా పునఃపరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు. కాగా కంపెనీ తీరుపై కార్మికవర్గాల్లో తీవ్రఅసంతృప్తి నెలకొంది. ఏటా చేపట్టే పదోన్నతుల్లో సీనియర్లకు బదులు జూనియర్లకు పదోన్నతి కల్పించడం, అర్హులు ఆందోళన చేయడం పరిపాటిగా మారింది. గతంలోనూ ఇదే సైలో ఎక్కి కొందరు ఆత్మహత్యకు యత్నించారు. దాదాపు పదేళ్ల కిత్రం ఒక కార్మికుడు ఉరివేసుకుని ఆత్మహత్య కూడా చేసుకున్నాడు. అయినా.. అధికారుల పద్ధతి మారడం లేదనే విమర్శలు ఉన్నాయి. దాదాపు 20ఏళ్లుగా పనిచేస్తున్న వారు ఇప్పటికీ కాంట్రాక్ట్ కార్మికులుగానే కొనసాగుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రాతినిధ్యం వహిస్తున్న యూనియన్‌ల ఒత్తిడితోనే పదోన్నతుల విషయంలో అవకతవకలు చోటుచేసుకుంటున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆరోపణల్లో నిజం లేదు


మాట్లాడుతున్న అసోసియేషన్ బాధ్యులు

- వేస్ట్ మెటీరియల్‌కు వే బిల్ ఉండదు
- లారీ ఓనర్స్ అసోసియేషన్ బాధ్యులు

విద్యానగర్(కరీంనగర్): ఎన్టీపీసీ నుంచి వచ్చే బూడిద విషయంలో వాస్తవాలు తెలియకుండా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతున్నారని, ఆయన ఆరోపణల్లో నిజం లేదని లారీ ఓనర్స్ అసోసియేషన్ బాధ్యులు ఇ.చిరంజీవి గౌడ్, డి.బాలు తెలిపారు. సోమవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో వారు మాట్లాడారు. వేస్ట్ మెటీరియల్‌కు వే బిల్ ఉండదన్న విషయం ఎమ్మెల్యేకు తెలియకపోవడం శోచనీయమన్నారు. ప్రజాప్రతినిధిగా ఉండి ఆర్థిక ఇబ్బందుల్లో జీవనం సాగిస్తున్న లారీ ఓనర్స్‌కు వ్యతిరేకంగా మాట్లాడటం బాధాకరమని పేర్కొన్నారు. డీజిల్ ధరలు పెరిగి, కిరాయిలు లేక ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టలేని స్థితిలో ఉన్న తమ సంక్షేమాన్ని పట్టించుకోకుండా ఇలా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పొన్నం ప్రభాకర్ రవాణాశాఖ మంత్రి కావడం కౌశిక్‌రెడ్డికి ఇబ్బందిగా ఉంటే ఆయనను రాజకీయంగా ఎదుర్కోవాలే తప్ప రెక్కాడితే గానీ డొక్కాడని తమను అడ్డం పెట్టుకొని, రాజకీయాలు చేయడం తగదన్నారు. 20 ఏళ్లుగా లారీలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న తమను ఇప్పటివరకు ఏ ఎమ్మెల్యే లారీలు నిలిపివేయించి, ఇబ్బందులకు గురిచేయలేదని, ఆ ఘనత కౌశిక్‌రెడ్డికే దక్కిందని పేర్కొన్నారు. సమావేశంలో లారీ ఓనర్స్ ఎండీ.తాహెర్, టి.అనిల్ గౌడ్, బి.రమేశ్, పి.సతీశ్‌గౌడ్, ఎ.శ్రీనివాస్ యాదవ్, ఎండీ.తాలీబ్, సయ్యద్ శివాజుద్దీన్, జి.శ్రీనివాస్, జి.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆగివున్న ట్రాలీని ఢీకొన్న ద్విచక్రవాహనం

- ఒకరికి తీవ్ర గాయాలు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మండలంలోని రేగడిమద్దికుంటకు చెందిన మామిడి జలపతి ఆదివారం ద్విచక్రవాహనంపై కరీంనగర్ వెళ్లాడు. రాత్రి తిరిగి వస్తుండగా నర్సయ్యపల్లి శివారులో రాజీవ్ రహదారి పక్కన ఆగివున్న ట్రాలీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


బోల్తాపడిన ఆటో

ఓదెల(పెద్దపల్లి): ఓదెల గ్రామ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బండ దేవేందర్‌రెడ్డి, అఖిల్‌రెడ్డి, సిద్ధూ బైక్‌పై ఓదెల నుంచి స్వగ్రామం వెళ్తున్నారు. గంగారం గ్రామానికి చెందిన కిరణ్ ఓదెల గ్రామ శివారులో ఆటోతో వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడింది. దేవేందర్‌రెడ్డి, అఖిల్‌రెడ్డి, సిద్ధూకు తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. పొత్కపల్లి ఏఎస్సై సుధాకర్ సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించారు. వివరాలు సేకరించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 'ట్రినిటీ' ప్రతిభ


హనీకర్

కరీంనగర్: ఐఐటీ–జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ట్రినిటీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జె.హనీకర్ ఆలిండియా 19వ ర్యాంకు, రఘుపతి 124, అజయ్ 195, బి.రంజిత్‌కుమార్ 1,005, నిస్సీ జాస్పర్ 1,213, ఆశిష్ 1,261, జతిన్ 1,645, పి.ప్రజ్వల్ 2,281వ ర్యాంకు సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారిని సోమవారం అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలువురు సింగరేణి అధికారులకు పదోన్నతి

గోదావరిఖని(రామగుండం): సింగరేణి వ్యాప్తంగా పలువురు అధికారులకు పదోన్నతి కల్పిస్తూ, బదిలీ చేస్తూ యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సింగరేణి పర్సనల్ జీఎంగా శామ్యూల్ సుధాకర్ నియమితులయ్యారు. సంస్థ సూపర్‌బజార్ ఏజీఎంగా ఉన్న ఆయనను జీఎం వెల్ఫేర్, రిక్రూట్‌మెంట్ సెల్‌కు బదిలీ చేశారు. అలాగే, ఏజీఎం నికోలస్‌ను ఏజీఎం ఎడ్యుకేషన్ నుంచి జీఎం ఎడ్యుకేషన్‌గా పదోన్నతి కల్పించి, బదిలీ చేశారు. ఎడ్యుకేషన్ జీఎంగా పనిచేస్తున్న వెంకటేశ్వర్‌రావును ఎస్‌వోటూ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా పంపారు. నలుగురు ఈఅండ్ఎం అధికారులు బదిలీ అయ్యారు. వీరిలో పలువురుకి పదోన్నతి లభించింది. ఆర్జీ–1 ఏరియా ఇంజినీర్ రామ్మూర్తికి పదోన్నతి కల్పించి, కార్పొరేట్ టెక్నికల్ సర్వీస్ ఈఅండ్ఎం జీఎంగా బదిలీ చేశారు. ఆర్జీ–3 ఏరియా ఇంజినీర్ ఎలీషాను కార్పొరేట్ స్టోర్స్ జీఎంగా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేశారు. శ్రీరాంపూర్ సీఎస్పీ డీజీఎంగా పని చేస్తున్న దాసరి వెంకటేశ్వర్‌రావును ఆర్జీ–1 ఏరియా ఇంజినీర్‌గా బదిలీ చేశారు. ఇల్లెందు ఏరియా వర్క్‌షాప్‌లో పని చేస్తున్న విజయశేఖరబాబును ఆర్జీ–3 ఏరియా ఇంజినీర్‌గా పంపారు. ముగ్గురు మైనింగ్ విభాగం ఏజీఎంలకు పదోన్నతి కల్పించారు. బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ ఏజీఎంగా పని చేస్తున్న రఘుకుమార్ అదే ఏరియాకు సేఫ్టీ జీఎంగా నియమితులయ్యారు. ఎస్టేట్స్ ఏజీఎం బండి వెంకటయ్యకు ఎస్టేట్స్ జీఎంగా పదోన్నతి కల్పించారు. అలాగే, హెచ్ఆర్‌డీ ఏజీఎం వీసం కృష్ణయ్య హెచ్ఆర్‌డీ జీఎంగా పదోన్నతి పొందారు.

రెస్క్యూ పోటీలకు సింగరేణి జట్టు ఎంపిక

గోదావరిఖని(రామగుండం): 13వ అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో పాల్గొనే సింగరేణి జట్టును యాజమాన్యం ఎంపిక చేసింది. ఈ ఏడాది సెప్టెంబర్ 10 నుంచి కొలంబియా దేశంలో పోటీలు జరగనున్నాయి. మొత్తం 10 మంది సభ్యులను ఎంపిక చేశారు. వీరందరూ వీసా కోసం ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవాలని యాజమాన్యం సూచించింది. కాగా, పోటీలకు జట్టు సభ్యుల ఎంపిక విషయంలో నెలకొన్న పంచాయితీ సంస్థ సీఎండీ బలరాం వద్దకు చేరింది. ఆయన పర్యవేక్షణలోనే సభ్యుల పేర్లను ఈ నెల 7వ తేదీనే ఖరారు చేసినట్లు అధికారులు సోమవారం తెలిపారు.

పోటీలకు ఎంపికైన జట్టు సభ్యుల వివరాలు..

సభ్యుడి పేరు	హోదా	ఏరియా
బొలిశెట్టి శ్రవణ్‌కుమార్	మైనింగ్ సర్దార్	ఆర్జీ–2
గుర్రం మహేంద్ర	హెడ్ ఓవర్‌మెన్	భూపాలపల్లి
బోయిని సత్యనారాయణ	మైనింగ్ సర్దార్	మందమర్రి
పెద్ది శ్రీకాంత్	మైనింగ్ సర్దార్	ఆర్జీ–1
కుడిరె అనిల్‌కుమార్	అండర్ మేనేజర్	ఏపీఏ
బైరి సాంబశివుడు	మైనింగ్ సర్దార్	శ్రీరాంపూర్
జనగామ నాగరాజు	సీనియర్ అసిస్టెంట్	ఆర్జీ–1
గెల్లు పరమేశ్	జీఎంఈ	ఆర్జీ–1
గొడిసెల మనోహర్	అండర్ మేనేజర్	మణుగూరు
అదనపు మెంబర్‌గా		
గుజ్జుల రాకేశ్	ఎంఏడబ్ల్యూ	ఏపీఏ

ప్రయాణికులపై తేనెటీగల దాడి


తేనెటీగల భయంతో దుప్పటి కప్పుకొని వెళ్తున్న యువకుడు

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో రావి చెట్టుపై ఉన్న తేనెటీగలు ప్రయాణికులపై సోమ వారం దాడి చేశాయి. వేములవాడ–కోరుట్ల ప్రధాన రహదారిపై ఉన్న రావి చెట్టుపై తేనెటీగలు రెండు రోజులుగా ఇదే ప్రాంతంలో స్వైర విహారం చేస్తున్నాయి. ఇటుగా వెళ్లిన హీర్జం వెంకటేశం, అట్టపెల్లి భూమయ్య, పెరమాడ్ల తిరుపతి, ఎండీ మోసిన్, మెడిశెట్టి మధుతోపాటు 50 మందిపై దాడి చేశాయి. విషయం తెలుసుకున్న స్థానికులు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేయగా.. తామేమి చేయలేమని చెప్పారు. మండల కోఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్ ఆధ్వర్యంలో తేనెటీగల తెట్టెను చెట్టుపై నుంచి తొలగించాలని కోరుతూ ప్రజావాణిలో వినతి పత్రాన్ని సమర్పించారు.

రేషన్ దుకాణాల్లో రంగు మారిన బియ్యం పంపిణీ


నాసిరకం బియ్యం

మేడిపల్లి(జగిత్యాల): ఉమ్మడి మేడిపల్లి మండల వ్యాప్తంగా నాసిరకం రేషన్ బియ్యం పంపిణీతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. సన్న బియ్యం సంగతి దేవుడెరుగు.. ఉన్న బియ్యం కూడా బాగా లేవని వాపోతున్నారు. గత నెలలో అందజేసిన రేషన్ బియ్యం నాసిరకంగా, రంగు మారి ఉండి వండడానికి, తినడానికి వీల్లేకుండా ఉన్నాయని వినియోగదారులు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలిపారు. గోవిందారం ఎంపీటీసీ నెల్లుట్ల పూర్ణిమా జూన్ 6న జరిగిన సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పందిస్తూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులకు సూచించారు. అయినా అధికారుల తీరు మారడం లేదు. ఈ నెలలో వినియోగదారులకు అందిస్తున్న బియ్యం కూడా నాసిరకంగా, ఉండలు కట్టి, రంగు మారి, వండడానికి, తినడానికి వీల్లేకుండా ఉన్నాయని వాపోతున్నారు. ఈ బియ్యం తింటే ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, కడుపు నొప్పి, విరేచనాలు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు అన్నం వాసన వస్తోందని, మెత్తగా అవ్వడంతో తినటం లేదని అన్నారు. మేడిపల్లి మండలవ్యాప్తంగా సుమారు 9,731 కార్డులుండగా.. ప్రతి నెల సుమారు 1,70,132 కిలోల బియ్యం అందజేస్తున్నారు. భీమారం మండలవ్యాప్తంగా సుమారు 7,338 కార్డులుండగా.. సుమారు 1,26,443 కిలోల బియ్యం అందజేస్తున్నారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలి


మాట్లాడుతున్న భూపాల్

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్

వేములవాడఅర్బన్: రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి నేటితరం యువత నడుం బిగించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ పేర్కొన్నారు. వేములవాడలోని మహాలింగేశ్వర గార్డెన్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీపీఎం శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. భూపాల్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ సర్కార్ పదేళ్లుగా అధికారంలో ఉండి దేశ ప్రజలకు మేలు చేయలేదన్నారు. తమను ప్రశ్నించిన వారిని దేశ ద్రోహులుగా చిత్రీకరిస్తూ అనేకమంది హేతువాదులు, జర్నలిస్టులు, మేధావులను పొట్టన పెట్టుకుందని పేర్కొన్నారు. మత విద్వేషాలు నింపుకున్న ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో బీజేపీ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రిజర్వేషన్లను పేదలకు అందకుండా చేయాలనే దురుద్దేశంతో పని చేస్తోందని విమర్శించారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగాన్ని హత్తుకొని ముద్దాడుతూ దానిపై కపట ప్రేమ చూపారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్, నాయకులు ముత్యంరావు, జవ్వాజి విమల, నర్సయ్య, నాగరాజు, రమణ, శ్రీధర్, పద్మ, ప్రశాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న దర్శనానికి నాలుగు గంటలు


ఆలయంలో భక్తులు

- వేములవాడకు పోటెత్తిన భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు సోమవారం ఒక్కో భక్తుడికి దాదాపు నాలుగు గంటల సమయం పట్టింది. వేసవి సెలవులు దగ్గర పడుతుండడంతో భక్తులు భారీగా తరలివస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు గర్భగుడి దర్శనాలు, అభిషేకాలు, అన్నపూజలు రద్దు చేశారు. భక్తుల ద్వారా రూ.30 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.


కోడెమొక్కు చెల్లించుకుంటూ..

సాక్షి క్లాసిఫైడ్స్
SERVICES
CHANGE OF NAME
I, BOINA SARAIAH S/o KOMURAIAH (Old Name) H.No. 2-68, Indiranagar, Kothapally (Vill), Huzurabad (Mdl), Karimnagar (Dist), Telangana have changed my name as BOINI SARAIAH S/o KOMURAIAH (New Name)
[K-1187414]
www.sakshi.com
గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824